క్లుప్తంగా

క్రిస్మస్ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం, వెంకటేష్

చీరాల: క్రిస్మస్ పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని అన్నారు. మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారన్నారు. క్రీస్తు బోధనలు మనుషులందరికి ఎప్పటికి సన్మార్గంలో నడిపిస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు.

ఘనంగా ఈశ్వరీ మహాదేవి ఆరాధన



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కాకానిపాలెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో జగన్మాత ఈశ్వరీ మహాదేవి 235వ ఆరాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పురోహితుడు బొప్పూడి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, అద్దంకి పట్టణ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, ఉండవల్లి కృష్ణారావు, చెన్నుపల్లి కోటిలింగాచారి, రవికుమార్, ఏలూరి వీరబ్రహ్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు పంటల బీమా




రైతులకు సూచనలు అందిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు ధన్‌రాజ్

మేదరమెట్ల: బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు పంటల బీమా పథకం ఈనెలాఖరులోగా చెల్లించుకోవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకుడు కే.ధన్‌రాజ్ అన్నారు. కొరిశపాడు మండలంలోని దైవాలరావూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు సలహాలు, సూచనలు అధికారులు అందజేశారు. ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సందర్భంగా పంట పొలాల్లో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు బీబీజాన్, ప్రత్యూష, శ్రీకాంత్ పాల్గొన్నారు.



వేటపాలెంలో విద్యుత్ దీపాల అలంకరణలో ఆర్‌సీఎం చర్చి



లూథరన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు లైటింగ్



చీరాలలోని థామస్‌పేటలో క్రీస్తు జననాన్ని చూపే సెట్టింగ్



దేవుని వాక్య సందేశం అందిస్తున్న రెవరెండ్ డాక్టర్ పాల్ ఇమ్మానియేల్



కారంచేడులో పెద్ద చర్చి వద్ద లైటింగ్‌తో ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు చిత్రం

లోక రక్షకుడి పండుగకు సిద్ధం

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు
- రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ
- అర్ధరాత్రి నుంచే మొదలైన క్రిస్మస్ పండుగ సంబరాలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన పాస్టర్లు, క్రైస్తవులు

కారంచేడు: లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పర్వదినానికి చర్చిలు సిద్ధమయ్యాయి. గత ఆదివారం ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ప్రతి చర్చి పరిధిలో ఇప్పటికే సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారుల కీర్తనలు ఆలపించడంలోను, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. బుధవారం జరగబోయే పండుగ కోసం కారంచేడులోని ఆర్సీఎం (పెద్ద చర్చి), ఎల్ఎఫ్ఎల్ చర్చి, పెంతొకొస్తు, బాప్టిస్టు చర్చి, బేతేలు ప్రార్థనా మందిరంలను ఇప్పటికే ముస్తాబు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏసు క్రీస్తు జన్మదినాన్ని ప్రతిబింబించేలా సెట్టింగులు ఏర్పాటు చేశారు. చర్చి ఫాదర్‌లు, పాస్టర్‌లు ఏసుక్రీస్తు ఈ లోకాన్ని రక్షించడానికి లోకంలో జన్మించారని క్రైస్తవులను బోధించారు. ఆయన జన్మదినంను పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా జరగబోయే ఈ పండుగను ప్రతి క్రైస్తవులు ఆనందంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మండలంలోని దగ్గుబాడు లూథరన్ చర్చిని దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, కొడవలివారిపాలెం, రంగప్పనాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం, తిమిడెదపాడు గ్రామాల్లోని చర్చిలను రంగులతో అలంకరించారు.



విద్యుత్ వెలుగులతో ధగధగ మెరిసిపోతున్న చీరాలలోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి



వేటపాలెంలో పశువుల పాక సెట్టింగ్..



వేటపాలెంలో విద్యుత్ దీపాలతో మెరుస్తున్న రోడ్డు

వేటపాలెంలో..

వేటపాలెం: కళ్లు చెదిరే విద్యుద్దీప కాంతులతో చర్చిలు ధగధగలాడుతున్నాయి. క్రైస్తవ విశ్వాసుల ఇళ్లపై నక్షత్రాలు మెరుస్తున్నాయి. క్రీస్తు ప్రభువు ఆకాశ తారగా భుమిపై పాపులను ప్రక్షాళన చేసి దైవ సన్నిధికి చేర్చే ఆ పవిత్రమైన రోజని ఈ వెలుగులు చెప్పకనే చెప్తున్నాయి. ఏసయ్య రాకను స్వాగతిస్తూ చర్చిల్లోని ప్రతి అణువును విద్యుత్ దీపకాంతులతో నింపేశారు. చర్చిలన్నింటా పశువుల పాకను రూపొందించి బాల ఏసును ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా 53వ కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు..

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో సోమవారం రాత్రి సెయింట్ మార్క్స్ యూత్‌లీగ్ ఆధ్వర్యంలో 53వ కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్ రెవరెండ్ పిల్లి దేవదాసు, రెవరెండ్ నానిబాబులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య ప్రసంగీకుడిగా విజయవాడకు చెందిన రెవరెండ్ డాక్టర్ పాల్ ఇమ్మానియేల్ పాల్గొని దేవుని వాక్య సందేశాలు అందించారు. వీనుల విందైన సంగీతాల మధ్య యూత్ సభ్యులు దేవుని ఆలపించారు. ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ కేక్ కట్‌చేసి క్రీస్తు రాకను కాంక్షిస్తు క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ సభ్యులు, సంఘస్థులు పాల్గొన్నారు.



వేటపాలెం: విద్యుత్ దీపాలకంరణలో ఆర్‌సీఎం చర్చి

నాగవరపమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలో నగదు లెక్కిస్తున్న సిబ్బంది

వేటపాలెం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనగ నాగవరపమ్మ అమ్మవారి హుండీని అధికారులు లెక్కించారు. రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసి ఉన్న అమ్మవారి ఆలయం ప్రసిద్ధి చెందినది. మంగళవారం హుండీని లెక్కించగా రూ. 2.04 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు తెలిపారు. ఈ ఏడాది జూన్ 22వ తేదీ నుంచి ఈ రోజు వరకు భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకులు లెక్కించామని తెలిపారు. హుండీలో నగదుతో పాటు 110 అమెరికన్ డాలర్లు భక్తులు అమ్మవారికి కానుకగా చెల్లించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ పోతిన శ్రీనివాసరావు, సురేష్, గోవిందల సుబ్బారావు, వెంకట్రావు ఉన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం, చిత్త నక్షత్రం దశమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మానాయుడు మంగళశారం తెలిపారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

బల్లికురవ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధాకర్



బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్

బల్లికురవ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే సుధాకర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఏడున్నరేళ్లుగా ఈ కళాశాలలో ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీగా ఉంది. కళాశాలలోని అర్థశాస్త్ర అధ్యాపకుడు ఎం అనిల్‌కుమార్, ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ఇప్పటివరకు పనిచేశారు. కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిషు అధ్యాపకుడిగా పనిచేస్తున్న సుధాకర్ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. అనంతరం సహచర అధ్యాపకులు ప్రిన్సిపాల్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రిటైర్డ్ కాలేజీ టీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా జంపాల



గంగాధరరావు

చీరాల అర్బన్: రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా చీరాలకు చెందిన రిటైర్డు అధ్యాపకుడు జంపాల గంగాధరరావు ఎన్నికయ్యారు. సోమవారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆవరణలో జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో గంగాధరరావు విజయం సాధించారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో వృద్ధులైన ఉద్యోగ విరమణ చేసిన సహచర మిత్రుల సమస్యలను పరిష్కరించడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను అసోసియేషన్ ప్రకాశం, బాపట్ల జిల్లా శాఖల సభ్యులు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి బాలాజీ నివాళి



ఆనందరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న యడం బాలాజీ



చిమటావారిపాలెంలో నాయకుడిని పరామర్శిస్తున్న యడం బాలాజీ



మృతుడు ఆనందరావు (ఫైల్)

యద్దనపూడి: మండలంలోని పూనూరు ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బొందు ఆనందరావు (43) గుండె పోటుతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ మంగళవారం పూనూరు వచ్చి ఆనందరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆనందరావు మృతిచెందటం బాధాకరమని, ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆనందరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చినగంజాం: పర్చూరు మండలం చిమటావారిపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గనిపిశెట్టి శ్రీనివాసరావును యడం బాలాజీ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, నాయకులు లక్ష్మీ దీపక్, కోటా శ్రీనివాసరావు, గాజుల రమేష్, రాంబాబు ఉన్నారు.

గుండ్లకమ్మ నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు



ధ్వంసం అయిన పంట

బల్లికురవ: గుండ్లకమ్మ నుంచి యథేచ్ఛగా ఇసుక తరలిస్తూ తమ పంట పొలాలను ధ్వంసం చేస్తున్నారని రైతులు బల్లికురవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల వివరాల మేరకు.. మండలంలోని వెలమవారిపాలెం పంచాయతీలోని జమ్ములమడక సమీపంలోని గుండ్లకమ్మ నుంచి మంగళవారం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక రేవులో నుంచి కంది, మిర్చి కూరగాయల పొలాల్లో గుండా రాకపోకలు సాగిస్తున్నారు. చేతికందే దశకు ఉన్న పైర్లు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి వేలకు వేలు పెట్టుబడులు పెడుతన్నామని, ఈ పరిస్థితుల్లో నేలవాలుతున్నాయని రైతులు వివరించారు. ఈవిషయాలను ఇసుక తరలించే వాహనదారులు దృష్టికి తీసుకు వచ్చి పట్టించుకోకపోవటంతో ఎస్సై దృష్టికి తెచ్చారు. ఎస్సై జీవి చౌదరి సిబ్బందిని పంపి పంటలు నష్టపోకుండా ఇసుక తరలించుకోవాలని సూచించారు.

ముసురుతో రైతు గుండెల్లో గుబులు



తిమ్మాయపాలెంలో కురుస్తున్న వర్షం



సాగులో ఉన్న శనగ

అద్దంకి: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని ఉందన్న చందగా మారింది రైతు పరిస్థితి. ఏదో విధంగా భూములు పదునై విత్తిన పంటలు కళకళలాడుతున్న సమయంలో ముసురు వర్షంతో రైతులు గుండెల్లో గుబులుపుడుతోంది. ఈ నెల 27, 28 తేదీల్లో వర్షం పడుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తుండడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పప్పు శనగ, పూతకు వచ్చిన కంది, కొట్టుడుకు వచ్చిన పొగాకు పంటలకు వర్షం మరింత పెరిగితే నష్టం తీవ్ర కలిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 15 వేల ఎకరాలకు పైగా పప్పు శనగ, 10 వేల ఎకరాల వరకు కంది, మరో 12 నుంచి 15 వేల ఎకరాల్లో పొగాకు పంటను రైతులు అద్దంకి, కొరిశపాడు, జే. పంగులూరు, బల్లికురవ మండలాల్లో సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంటల్లో పప్పు శనగ, కంది పూతదశలో ఉంది. పొగాకు పంట అందే దొర ఆకు కొడుతున్నారు. ఇందులో పప్పు శనగ పంటకు పెద్దగా వర్షాలు పనికిరాదు, అందునా పూతకు వచ్చే సమయంలో వర్షం పడితే పులుసు కారిపోయి నల్లగా మారి పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. అదే విధంగా పూతకు వచ్చిన కంది పూత రాలిపోతుంది. కొట్టుకు వచ్చిన పొగ ఆకు మీద మడ్డి కారిపోయి ఆకు నాణత్య బాగా తగ్గి రేటు పలకదు. ఈపరిస్థితుల్లో వర్షం మంరిత పెరిగితే రైతులు నిలువునామునిగినట్లే అవుతుంది. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టితో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏదో శని చుట్టుకుందని రైతులు మోటుపల్లి రామయ్య, టీ వేణుబాబు, ఏ రాంబాబు, రామారావు, వెంకటేశ్వర్లు తదితరులు చెప్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారిని అడుగ్గా ప్రస్తుతం శనగ పంట కొంత వరకు 30 రోజుల వ్యవధిలో ఉందని దానికిపెద్దగా ఇబ్బంది ఉండదన్నారు. అయితే నీరు నిలబడితే శనగ ఎండిపోతుందని, పొగాకు, కంది పూతకు నష్టం కలిగే అవకాశం ఉందని చెప్పారు.



పొగాకు

తుఫాన్‌పై రైతులు అప్రమత్తంగా ఉండాలి



చెరుకూరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ అధికారులు

అద్దంకి రూరల్: తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈనెల 26 వ తేదీ వరకు అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు వరి పంట కోత దశలో ఉన్నందున పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు వరికోతలు కోయవద్దని రైతులకు సూచించారు. రబీలో సాగు చేసిన వరికి ఈనుల 31 వ తేది లోపు బీమా చేయించుకోవాలన్నారు. ఎకరాకు రూ. 126 చెల్లించాలని తెలిపారు. బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకు అధికారులను కలిసి బీమా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్ దీప్తి, వీఏఏ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో ఉపయోగాలు..

చినగంజాం: ఈ-క్రాప్‌తో చాలా ఉపయోగాలు ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ మోహన్‌రావు పేర్కొన్నారు. పర్చూరు మండలం చెరుకూరు గ్రామ పరిధిలో గల రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేస్తున్న ప్రతి రైతు కూడా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా కౌలు రైతులు కూడా తాము వేసిన పంటను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రామ్‌మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉషారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



పేరాయపాలెంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

నూతన ప్రార్థన మందిరం ప్రారంభం



నూతన మందిరాన్ని ప్రారంభిస్తున్న దైవ సేవకులు

చినగంజాం: దేవుని నమ్మిన ప్రజలు సత్ప్రవర్తన కలిగి జీవిస్తే ఆ సంఘం అభివృద్ధి చెందుతుందని చీరాలకు చెందిన దైవ సేవకుడు బ్రదర్ సాల్మన్ అన్నారు. మంగళవారం చినగంజాం అంబేడ్కర్ నగర్‌లో సహోదరులు మేడికొండ ప్రదీప్ కుమార్, బొబ్బిమేర అనిల్ కుమార్, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నూతన మందిర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రదర్ సాల్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని దైవ వర్తమానాన్ని అందించారు. దేవుని సంఘం పరిశుద్ధత కలిగి ఉండాలన్నారు. ఇతరులపై ప్రేమ, విశ్వాసం చూపించాలని చెప్పారు. కార్యక్రమంలో సహోదరులు రవి, శ్యాంసన్, ఇశ్రాయేలు, వినోద్, ప్రసాద్, కళ్యాణ్, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఐజాక్, చంద్ర పాల్గొన్నారు.